GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 83 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శుక్రవారం 25 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## జర్మనీ వీసాలు 20వేలు నుంచి 90 వేలకు పెంపు..

## ప్రధాని మోదీ వెల్లడి

భారతీయ శ్రామిక శక్తిపై విశ్వాసంతో జర్మనీ వీసాల సంఖ్యను పెంచిందని ప్రధాని మోదీ అన్నారు.



**దిల్లీ, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** నైపుణ్యం కలిగిన భారత శ్రామిక శక్తి కోసం వీసాల సంఖ్యను పెంచేందుకు జర్మనీ నిర్ణయించింది. ఈ సంఖ్యను 20వేల నుంచి 90వేలకు పెంచిందని ప్రధాని మోదీ తాజాగా వెల్లడించారు. 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో ప్రధాని మాట్లాడుతూ.. రాబోయే 25 ఏళ్లకు వికసిత్ భారత్ కోసం రోడ్మ్యాప్ రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు.

“ఫోకస్ ఆన్ ఇండియా పేరిట జర్మనీ క్యాబినెట్ ఒక పత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగులకు వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత శ్రామిక శక్తిపై జర్మనీ ఉంచిన విశ్వాసం అద్భుతం. ఈ నిర్ణయం ఆ దేశ వృద్ధికి దోహదం చేస్తుంది. భారత్ తయారీ కేంద్రంగా మారింది. భారత్, జర్మనీ భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాదు.. రెండూ బలమైన ప్రజాస్వామిక పరివర్తన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచం ఉద్రిక్తతలు, సంఘర్షణ, అనిశ్చితితో ఉన్న సమయంలో ఇరు దేశాల వ్యూహాత్మక బంధం బలోపేతమవుతోంది. యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు.. శాంతి కోసం సాధ్యమైనంత సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగానే ఉంటుంది” ప్రధాని మోదీ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా గురువారం జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్ భారత్కు వచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సమావేశం నిర్వహించుకుంటున్నామని వ్యాఖ్యానించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థ అని కొనియాడారు.

## తెలుగు చిత్ర పరిశ్రమ విజయవాడకు షిఫ్ట్ అవ్వాలి :మంత్రి కందుల దుర్గేశ్

సుస్థిర పర్యటకంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.



**విశాఖపట్నం, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** సుస్థిర పర్యటకంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. రాష్ట్రంలోని ఏదైనా పర్యటక ప్రాంతానికి వెళ్తే 3-4 రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం%ఽ%ట్రావెల్ సమ్మిట్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. “సినిమాల చిత్రీకరణ జరిగితే రెవెన్యూ పెరుగుతుంది. టికెట్ల ధరలు పెంచాలని వస-్తున్నారు. తెలుగు సినిమాలకు సహకారం అందిస్తాం. అంతకంటేముందు చిత్ర పరిశ్రమ విజయవాడకు షిఫ్ట్ అయితే మరింత ఉపయుక్తంగా ఉంటుంది. ఎక్కువ పెట్టుబడులు పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు. అందుకే పీపీపీ విధానంపై దృష్టి పెడుతున్నాం. సలహాలు తీసుకొని అందరికీ అనుకూలంగా ఉండేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తాం. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి త్వరలో రూ.1000 కోట్లు కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. రాష్ట్రంలో భారీ తీర ప్రాంతం ఉన్నా బ్లూ ఫాగ్ బీచ్ ఒక్కటే ఉంది. మిగిలిన బీచ్లను అభివృద్ధి చేయడంపై దృష్టిసారిస్తాం. ఏపీలోని పర్యటక ప్రాంతాలపై అందరూ కలసి ప్రచారం చేయాలి. రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతాల అసలైన పేర్లను సినిమాలో ప్రస్తావించాలి. అప్పుడే ఈ ప్రాంతాల గురించి అందరికీ రాష్ట్రంలో 90 శాతం ఆధ్యాత్మిక టూరిజం ఉంటుంది. తిరుపతి, అన్నవరం, సింహాచలం, శ్రీశైలం దర్శనానికి వస్తున్న భక్తులు ఆయా దేవాలయాల సందర్శనకే పరిమితమవుతున్నారు. పరిసర ప్రాంతాలను కూడా తిలకించేలా సర్క్యూట్లను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో బౌద్ధ స్థూపాలను అభివృద్ధి చేస్తాం. పర్యటక, అటవీ, దేవాదాయ శాఖల మధ్య సమస్యల పరిష్కారానికి త్వరలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నాం. ఒబెరాయ్, తాజ్, మెఫిల్ తదితర సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. విశాఖను నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ ప్రకటించింది. ఇక్కడ టూరిజం అభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటాం. క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వంతో ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. త్వరలో విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు క్రూయిజ్ ప్రారంభిస్తాం” అని కందుల దుర్గేశ్ వివరించారు. భారత్లో ఫ్రెండ్లీ టూరిజం లేదని సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్బాబు అన్నారు. ఏదైనా ప్రాంతానికి పర్యటకులు వెళ్తే సులభంగా విహరించే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. సినిమా టూరిజానికి సంబంధించి చిత్రీకరణలకు చాలా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పర్యటక ప్రాంతాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత విధానాల్లో ఆహారం తయారీపై దృష్టిపెట్టాలని చెప్పారు. హోటళ్లలో ఆహారం రుచిగా ఉంటున్నా.. తయారుచేసే విధానం సరిగా లేదన్నారు.

## తెదేపా సభ్యత్వ నమోదు అక్టోబర్ 26 నుంచే..

## రూ.100తో రూ.5 లక్షల వరకు బీమా

సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.



**అమరావతి, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పార్టీని బలోపేతం చేయడం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో నేతలతో చర్చించారు. శనివారం (అక్టోబర్ 26) నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెదేపా ఏర్పాట్లు చేస్తోంది. రూ.100 సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారు. అలాగే, రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై ఉదయం నుంచి మూడు గంటల పాటు నేతలతో సీఎం చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రెండో లిస్ట్ విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నారు. మొదటి దశలో ఇచ్చిన 21 నామినేటెడ్ పదవులకు రెట్టింపు సంఖ్యలో రెండో జాబితా ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమి పక్షాలతోనూ చంద్రబాబు సంప్రదింపులు జరుపుతున్నారు. కష్టపడిన వారికే పదవి అనే విధానంలో భాగంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపికపై చర్చిస్తున్నారు.

## సినీ నటుడు అల్లు అర్జున్‌కి ఏపీ హైకోర్టులో ఊరట

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది.

**అమరావతి, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్ పై కేసు నమోదు చేశారు. తమపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఎఫ్ఐఆర్ ఆధారంగా నవంబరు 6 వరకు తదుపరి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. నవంబరు 6న తగిన ఉత్తర్వులిస్తామని హైకోర్టు తెలిపింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో నంద్యాల వైకాపా అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి అల్లుఅర్జున్ వచ్చారు. వైకాపా శ్రేణులు పట్టణ శివారు నుంచే భారీ వాహనాలు, మోటారు సైకిళ్లతో ప్రదర్శనగా పట్టణంలోకి ఆయన్ను తీసుకువచ్చాయి. ఆయన పర్యటనకు అధికారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అల్లు అర్జున్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిలపై అప్పట్లో నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.









## ఐసీఐసీఐ బ్యాంకు స్కామ్లో కీలక పరిణామం

విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకు స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.

**విజయవాడ, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకు స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బ్యాంకు మేనేజర్ నరేశ్ బృందం పెట్టుబడి పెట్టిన సంస్థకు సీఐడీ నోటీసులు ఇచ్చింది. నెక్సస్ సంస్థతో నరేశ్ లావాదేవీలు జరిపినట్లు సీఐడీ గుర్తించింది. ఖాతాదారుల నుంచి కాజేసిన డబ్బంతా నరేశ్ బృందం నెక్సస్ గ్రోత్లో పెట్టుబడి పెట్టినట్టు సమాచారం. దీంతో నరేశ్తో లావాదేవీలు నిర్వహించినవారిని సీఐడీ అధికారులు విచారించే అవకాశముంది. ఇప్పటికే మూడు బృందాలుగా ఏర్పడిన సీఐడీ అధికారులు విజయవాడ, నరసరావుపేట, చిలకలూరిపేట శాఖల్లో తనిఖీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట బ్రాంచిలో నరేశ్ చేసిన మోసాలను జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా గుర్తించారు. అతను పనిచేసిన కాలంలో వివిధ శాఖల్లో కలిపి మొత్తం 72 మంది ఖాతాదారుల నుంచి రూ.28 కోట్లు కాజేసినట్లు విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి కేసు గుంటూరు సీఐడీ కార్యాలయానికి బదిలీ చేశారు.

## ఆ నాణేలు చెల్లుతాయ్.. రోజువారీ లావాదేవీలకు వాడొచ్చు!

పది రూపాయాల నాణేలు చట్టబద్ధమైనవేనని.. రోజూవారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని సెంట్రల్ బ్యాక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ తెలిపారు.



**హైదరాబాద్, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** రూ.10 నాణేలు చట్టబద్ధమైనవేనని.. వీటిని రోజూవారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని సెంట్రల్ బ్యాక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ తెలిపారు. వీటి చలామణిని వ్యాపార లావాదేవీలకు ఉపయోగించాలనే ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కోఠిలోని బ్యాంక్ శాఖ వద్ద రూ.10 నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. తమ ఖాతాదారులకు ఈ నాణేలు వినియోగించాలని సూచిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లోనూ ఇవి చెల్లుబాటవుతున్నాయని తెలిపారు. ప్రజల్లో రూ.10 నాణేలపై ఉన్న అపోహలను తొలిగించేందుకే ఈ మేళాను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ నాణేలను లావాదేవీలకు చలామణి చేయవచ్చని, రూ.10 నోటు కంటే నాణేం ఎక్కువ కాలం మన్నికతో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులకు ఈ నాణేలను అందజేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# అమ్మకు వందనం కల.. నాన్నకు ఇంధనం భళా..!

## అమ్మకు వందనం కల.. నాన్నకు ఇంధనం భళా..!

- కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు తప్పని ఫీజుల మోత
- గత ఏడాదిగా తల్లిదండ్రులకు అందని ప్రభుత్వ విద్య ప్రయోజనము
- వచ్చే ఏడాది లోనైనా అమ్మకు వందనం కల ఫలించేనా..



**పాణ్యం, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** టిడిపి ,బిజెపి, జనసేన, మూడు పార్టీలు కలిసి 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయభేరి మోగించి ప్రభుత్వాన్ని కూటమి ప్రభుత్వంగా ఏర్పాటు చేశాయి. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. భారతదేశం మొత్తం మీద ఏడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించారు. మే 13న ఆంధ్రప్రదేశ్లో ఎన్నికలు నిర్వహించగా జూన్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదిరింది.

అక్టోబర్ 23 నాటికి 150 రోజుల కాలమైంది. అయితే సూపర్ సిక్స్ పథకాలతో అన్నా క్యాంటీన్లు, దీపావళికి ఉచిత గ్యాస్, అంటున్నారు అందులో అన్న క్యాంటీన్లు మాత్రం కార్యాచరణకు నోచుకున్నాయి .ఇంకా మిగిలిన పథకాలు ఎప్పుడు వస్తాయని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే సమాజానికి అత్యంత ప్రాధాన్యత కలిగినటువంటి అంశం విద్య గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో పాఠశాలకు వెళ్లే ప్రతి ఇంటిలో ఒక విద్యార్థికి రూ 15,000 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు ఈ పథకాన్ని కొనసాగించింది. 2024లో సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, బిజెపి, జనసేన లు ప్రత్యక్షంగా ఈ యొక్క పథకానికి పేరు మార్చి అమ్మకు వందనం పేరుతో ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికి కూడ రూ 15,000 నగదు చెల్లిస్తామని ఢంకా భజాయించారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటినుండి తుఫానులు, వరదలు, విపరీతంగా రావడంతో ప్రజాపాలన అస్తవ్యస్తంగా మారింది. విజయవాడ బుడమేరు కోపానికి గురైంది. దీంతో పరిపాలన పై కాస్త పట్టు సన్నగిల్లింది. వరదలతో పట్టణం మొత్తం పూర్తిగా చెల్లాచెదురు కావడంతో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు, వారికి పునరావాస సౌకర్యం కల్పించేందుకు పూర్తిగా నిమగ్నమయ్యారు. అయితే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు మాత్రం అమ్మకు వందనం కలగా మారిందని, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు మాత్రం ఎంతో కొంత ఆసరాగా ఉంటుందనుకున్న అమ్మకు వందనం సాయం రాకపోవడంతో తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు. ఫీజు చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వమని ,ఇళ్లకు పంపించిన సంఘటనలు కోకోల్ల లుగా ఉన్నాయి.


### ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు నిరాశ

నియోజకవర్గంలోని పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల ,మండలాలలో 132 ప్రభుత్వ పాఠశాలల్లో 14,607 మంది విద్యార్థులు, 42 ప్రైవేట్ పాఠశాలల్లో 12,374 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గత ఏడాది, ఈ ఏడాది కూడా ఈ విద్యార్థులకు అమ్మకు వందనం విద్యాప్రయోజనం కలగలేదని చెప్పాలి. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపుగా 10% తేడాతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తల్లిదండ్రుల నుండి పుస్తకాలు, దుస్తులు, విద్యాసామాగ్రి, తదితర అంశాల పేరుతో వేలకు వేల రూపాయలు గుంజుతున్నారు. అయితే పాఠశాల ఫీజులో కాస్త ప్రభుత్వం నుంచి ఆసరాగా వస్తుందనుకున్న నగదు రానందుకు తల్లిదండ్రులకు నిరాశ ఎదురవుతోంది. పాణ్యం మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 4,818 మంది విద్యార్థులు, 11 ప్రైవేట్ పాఠశాలల్లో 5,935 మంది విద్యార్థులు, ఓర్వకల్లు మండలంలో 48 ప్రభుత్వ పాఠశాలల్లో 6,329 మంది విద్యార్థులు, 21 ప్రైవేట్ పాఠశాలల్లో 3,918 మంది విద్యార్థులు, గడివేముల మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలల్లో 3,390 మంది విద్యార్థులు,10 ప్రైవేట్ పాఠశాలల్లో 2,461 మంది విద్యార్థులు చదువుతున్నారు.



### నాన్నకు ఇంధనం భళా..

అమ్మకు వందనం పథకం ఏమో కానీ, నాన్నకు మాత్రం ఇంధనం సంపూర్ణంగా అమలు జరుగుతోంది . అది కూడా ప్రభుత్వ మద్యం షాపులను పూర్తిగా రద్దుచేసి, వ్యక్తిగతంగా లైసెన్సుల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలను ఈ ప్రభుత్వంలో అప్పజెప్పారు. ఈనెల 16వ తేదీ నుండి మద్యం షాపులు అమలులోకి వచ్చాయి. పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, మండలాలలో 6 మద్యం షాపులు ప్రారంభమయ్యాయి. నాణ్యమైన మద్యం అందిస్తున్నారు కానీ, ధరల తగ్గుదలలో ఏమాత్రం ప్రభుత్వం ముందడుగు వేయలేదు. ఎన్నికల హామీలలో గంభీరంగా ధరలు తగ్గించి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామన్న మాటలు మందుబాబులకు ఇప్పుడు ఏమాత్రం రుచించడం లేదు. మద్యం సరఫరా లో శ్రద్ధ చూపించిన ప్రభుత్వం విద్యార్థుల సదువుపై, వారి భవిష్యత్తుపై , కాస్త శ్రద్ధ చూపిస్తే కన్న పేగులకు ఫీజుల్లో కాస్త సాయం అందుతుందని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



## అమరావతికి రైల్వే లైన్.. ఏపీ భాజపా సంబరాలు

అమరావతికి కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



**విజయవాడ, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** అమరావతికి కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడలోని భాజపా కార్యాలయంలో బాణసంచా కాల్చి ఆ పార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్కు ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు దిల్లీ వెళ్లి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగానే.. క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారని చెప్పారు. రైల్వే లైన్ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కేంద్రాన్ని కోరతామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని పురందేశ్వరి చెప్పారు.

## ఏపీలో దీపావళి నుంచే ఉచిత గ్యాస్.. 48 గంటల్లో నగదు జమ

ఆంధ్రప్రదేశ్లో దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది.




**అమరావతి, అక్టోబర్ 25 (రిపబ్లిక్‌న్యూస్):** ఆంధ్రప్రదేశ్లో దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ పథకానికి సంబంధించిన వివరాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. “సిలిండర్ బుక్ చేసుకోగానే ప్రజలకు ప్రభుత్వం నుంచి సమాచారం వెళ్తుంది. 24 నుంచి 48 గంటల్లో సిలిండర్ను అందిస్తామని ఆయిల్ కంపెనీలు చెప్పాయి. పట్టణాల్లో అయితే 24 గంటల్లోనే సరఫరా చేస్తామని తెలిపాయి. సిలిండర్ అందిన క్షణం నుంచి 48 గంటల్లోపు వారి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయిల్ కంపెనీలకు రూ.894 కోట్లు అందిస్తాం. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 29న ఆయిల్ కంపెనీలకు చెక్కు అందిస్తున్నాం’ అని మంత్రి వివరించారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో ఈ నెల 26న టీడీపీ సభ్యత్వ నమోదు



**నంద్యాల, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఈ నెల 26 వ తేది శనివారం సాయంత్రం 4 గంటలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి శుక్రవారం చెప్పారు. నంద్యాల పట్టణం, నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ఈ కార్యక్రమంనకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజ శేఖర్ రెడ్డిలు హాజరు అవుతున్నట్లు టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి వివరించారు.